# అనుచితం

నాకు ఆఫీసులో ప్రమోషన్ వచ్చే సమయానికి మావారికి బదిలీ అయిపోయింది మరో నగరానికి. ఉద్యోగం కోసం ఒంటరిగా ఉండటం అసాధ్యం అనిపించింది నాకు. ఇంకా చిన్నతనం. ఇక తప్పనిసరి పరిస్థితుల్లో నిక్షేపంలాంటి ఉద్యోగానికి నీళ్ళు వదులుకుని ఆయనతోబాటు మకాం ఎత్తేశాను.

ఆఫీసులో అందరూ గొప్ప విందు ఇచ్చి ఘనంగా వీడ్కోలు చెప్పారు నాకు. నేను ఉద్యోగాన్ని వదిలి వేస్తున్నందుకు స్టాఫ్‌లో కొంత మంది సంతోషించినా (వాళ్ళకి ప్రమోషన్ వస్తుందని), మొత్తంమీద మా బాస్‌తో సహా అందరూ బాధపడ్డారు. నావంటి సిన్సియర్ వర్కర్, పని అంటే ప్రాణం పెట్టే మనిషి వెళ్ళిపోతున్నందుకు. వాళ్ళందరికీ నామీద ఉన్న సద్భావానికి ఆనందంతో, కృతజ్ఞతతో నా కళ్ళమ్మట నీళ్ళు తిరిగాయి.

నేను ఆ పరిశోధనా సంస్థ ప్రారంభించిన కొత్తలోనే చేరాను. అప్పటికింకా ఎంతోమంది ఉద్యోగులు లేరు. బడ్జెట్ కూడా తక్కువే.

నేను ఉద్యోగ ప్రయత్నాలు చేస్తూ, అనుభవం సంపాదించడానికీ, కొంత ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవడానికీ ఆ సంస్థలో 'ఆనరరీ టెక్నికల్ అసిస్టెంట్'గా చేరాను. అధికారం, పరపతీ ఉన్న ఒక శ్రేయోభిలాషి ద్వారా అది సాధ్యపడింది. రెండు నెలల పాటు ఉచితంగా పని చేశాను. ఆ రెండు నెలల్లో పుస్తకాల ద్వారా తెలియని ఎన్నో విషయాలను అనుభవం ద్వారా నేర్చుకున్నాను. మంచి పనిమంతురాలిగా పేరు తెచ్చుకున్నాను. ఆ రెండు నెలల్లోనూ కొన్ని ఆంగ్ల దిన పత్రికల నుంచి కటింగ్స్ తీసి విషయానుక్రమంగా విభజించి నిర్ణీత పద్ధతి ప్రకారం ఫైల్ చేశాను. కట్టలు కట్టలుగా పడి ఉన్న గ్రంథాలను విషయానుసారంగా వర్గీకరించి వాటి సూచికను తయారు చెయ్యడంలో సహాయపడ్డాను. ఇలా కాస్తో కూస్తో ప్రతి విభాగంలోనూ పని నేర్చుకుంటూ, స్టాఫ్‌కి పెండింగ్ వర్క్ క్లియర్ చేయడంలో సహాయపడ్డాను. జీతం లేకుండా పని చేసినా, ఆ పనిలో ఎంతో ఆనందాన్నీ, తృప్తినీ పొందాను. నా వల్ల ఒక పరిశోధనా సంస్థ గ్రంథాలయంలో పెండింగ్ వర్క్ తరిగిందన్న తృప్తి!

నా కృషికి ప్రతి ఫలం కూడా దొరక్క పోలేదు. అప్పట్లో ఆ సంస్థలో ఉద్యోగానికి అవకాశం లేకపోయినా, ఈ అనుభవ జ్ఞానంతో, పొందిన ఆత్మవిశ్వాసంతో మరో చోట ఉద్యోగం సంపాదించ గలిగాను. అక్కడ జీతం వస్తున్నా, నా మనసంతా ఈసంస్థ మీదే ఉండేది. దీనిమీద పుట్టింటి మమకారం లాంటిది ఏర్పడింది. నా ఉద్యోగానుభవానికి పునాదులు ఇక్కడే ఏర్పడ్డాయాయెను!

ఏణ్ణర్థం తరవాత గాని ఈ సంస్థలో మళ్లీ పని చేసే అవకాశం లభించలేదు. ఒక స్టాఫ్ మెంబర్ రీసెర్చ్ కోసం యు.కె. వెళ్లిపోవడంతో

అతని జాగాలో ఖాళీ ఏర్పడింది. ఈ సంస్థ గ్రంథాలయాధికారి నాకు ప్రత్యేకం ఫోన్ చేసి ఆ ఉద్యోగానికి దరఖాస్తు పెట్టమని చెప్పాడు. నేను సంతోషంతో ఎగిరి గంతేశాను.

నేను చేరేటప్పటికి మళ్లీ పుస్తకాల కట్టలూ, వార్తాపత్రికల గుట్టలూ పత్రికల పోగులూ కనిపించాయి. పరిశోధన కోసం అమెరికాలోని ప్రఖ్యాత ప్రజాహిత సంస్థల నుంచి ధన సహాయం లభిస్తున్నా, ఆ ధనం గ్రంథాల కోసం, తదితర పరిశోధన సామగ్రి కోసం మాత్రమే నిర్దేశితమైంది. కొత్తగా ఏర్పరచిన సంస్థ, ప్రభుత్వ ధనసహాయం కూడా లేదు. అంచేత కావలసినంత మంది ఉద్యోగుల్ని నియమించడానికి తగిన ఆర్థిక స్తోమత ఉండేది కాదు సంస్థకి. అంచేత పని ఎక్కువ, పని చేసే వాళ్ళు తక్కువ—అనే పరిస్థితి ఏర్పడేది. ఎప్పుడు చూసినా, ఏ మూల చూసినా పని మూలుగుతూ ఉండేది.

ఇదివరకు నేను పనినేర్చుకోవడానికివాలంటరీగాచేరినట్లుగానే ఇంకెవరైనా అలావస్తే నేను వాళ్లని ఎంతోఆదరంగా చూసి, ఒక వైపు వాళ్లకి పనినేర్పిస్తూ, వాళ్లనుంచి వీలైనంతపని రాబట్టేదాన్ని. పెండింగ్‌వర్క్ ఎప్పటికప్పుడు క్లియర్ చేయడానికి ప్రయత్నం చేసేదాన్ని. నా మటుకు నేను కాఫీ తాగడానికి అందరిలా కేంటీనుకికూడా వెళ్ళేదాన్ని కాదు. మధ్యాహ్నం లంచ్ సమయంలోతోటి ఉద్యోగులతో కబుర్లు చెబుతూకాలక్షేపం చెయ్యడం మినహాయించిఆఫీసు సమయంలో ఒక్కక్షణంవృథాచేసే దాన్ని కాదు. పనిచేస్తున్న కొద్దీ ఇంకా చేయాలనే ఉత్సాహం పుట్టేది. రాత్రులు నిద్రలో కూడాపేపర్లూ, పుస్తకాలూ, పత్రికలే కనిపించేవి.

రెండేళ్ళుతిరక్కుండానే నాకు ప్రమోషన్ వచ్చేఅవకాశం వచ్చింది. అయితే దురదృష్టవశాత్తూ మా వారికి అదే సమయంలో మరో నగరానికి

బదలీ అయిపోవడంతో, నేను ఆ సదవకాశాన్ని అందుకోలేక పోయాను. ఎంతో బరువెక్కిన హృదయంతో వీడ్కోలు తీసుకున్నాను సహోద్యోగుల నుంచి, ఆసంస్థ మాత్రం నామదిలో అత్యంత ప్రియమైన స్నేహమయిగా నిలిచి పోయింది. ఒక తీయని కలగా మిగిలిపోయింది.

పాతిక సంవత్సరాలు పైనే అయింది. ఆయనకి మళ్ళీ ఈ ఊరికి ట్రాన్స్‌ఫర్ అయింది. ఈలోగా పిల్లలిద్దరూ పుట్టడం, పెరగడం, జీవితంలో కొంత స్థిరపడటం కూడా జరిగింది. మగపిల్లవాడు పెద్దవాడు. వాడు ఇంజనీరింగ్ డిగ్రీ సంపాదించి, ఒక ప్రైవేట్ ఫర్మ్‌లో ఉద్యోగం సంపాదించాడు. రెండో సంతానం ఆడపిల్ల. పోస్ట్‌గ్రాడ్యుయేషన్ కాగానే మ చి సంబంధం కుదిరింది. పెళ్ళయి ఏడాదయింది. ఇక మాకు పెద్ద బాధ్యతలేమీ లేవు. రిటైరయేందు కింకా వయస్సుంది.

ఆయన ఆఫీసుకి వెళ్ళిపోయాక నాకు బొత్తిగా తోచడంలేదు. పిల్లలిద్దరూ దగ్గరలేరు. బాధ్యతలు లేవు. బాధలూ లేవు. ఇద్దరు మనుషులకు వంట, ఇల్లు శుభ్రంగా ఉంచడం, పత్రికలు చదవడం— ఎన్ని చేసినా శూన్యంగా అనిపిస్తోంది. ఏం చెయ్యాలో తోచక సతమత మవుతున్నాను.

ఓ రోజు సాయంకాలం షాపింగ్ సెంటరులో మేమిద్దరం ఒక షాపులో ఏదో కొంటూండగా వెనకనుంచి "హలో మిసెస్ శర్మా" అని వినిపించింది పరిచయమైన గొంతులా అనిపించి వెనక్కి తిరిగి చూశాను. తెల్లగా లావుగా— పొట్ట, బట్టతల— గుర్తుపట్టలేక పోయాను. తెల్లబోయి చూస్తుంటే, "గుర్తుపట్టలేదా?" అన్నట్లు కళ్ళు చికిలించి మంద హాసం చేశాడు.

"మీరా?" అని, వెంటనే మా వారి భుజం తట్టి "శంకర్‌గారండీ, మా బాస్" అన్నాను.

"ఇంకా బాస్ నేనా?" అంటూ గలగలా నవ్వాడాయన. "ఎలా ఉన్నారు— ఏమిటి...." అంటూ మా వారినీ, నన్నూ ప్రశ్నలతో ముంచెత్తి, మా గురించి విశేషాలన్నీ తెలుసుకున్నాడు.

"మన సంస్థ ఎలా ఉందిప్పుడు"? ఫలానా ఫలానా వాళ్ళు ఇంకా అందులో పని చేస్తున్నారా అంటూ నేను కుశల ప్రశ్నలు వేశాను.

"అలా ప్రశ్నలు వెయ్యకపోతే సెంటరుకి రాకూడదా ఓ సారి? ఇంట్లో కూర్చుని ఏం చేస్తున్నారు? ఇప్పుడు మా రీసెర్చి సెంటర్ ప్రముఖ పరిశోధనా కేంద్రం అయింది. ప్రభుత్వం గుర్తింపు కూడా పొందింది. చాలా వృద్ధి పొందింది. మీరున్నప్పుడు పదిహేను మందో ఎంతో ఉండేవారేమో కదూ?" అన్నారు శంకర్‌గారు.

"చాలా ఆనందంగానూ, ఆశ్చర్యంగానూ, ఉంది. మీ సంస్థ గురించి పేపర్లో చదివాను గానీ, ఇంతలా ఊహించుకోలేక పోయాను".

"ఈ ఊళ్లోనే ఉండి ఇంకా ఊహల్లో ఉండటం దేనికీ? ఓ సారి వచ్చి మా సెంటర్ ప్రోగ్రెస్ చూడండి. పాత స్నేహితుల్ని కలుసుకో వచ్చు" అన్నారు.

"తప్పకుండా వస్తానండీ" అన్నాను.

"ఎప్పుడొస్తారు? రేపు లంచ్‌కి అక్కడికే రాకూడదూ?" అని శంకర్‌గారు హడావిడి చేసేసరికి నేను సిగ్గుపడి పోయాను.

నేను ఏమీ మాట్లాడక పోయేసరికి మా వారే కలుగజేసుకుని, "వస్తుందిలెండి, ఇంట్లో కూర్చుని 'ఏం చేస్తుంది? నేను సాయంకాలం రాగానే తోచడం లేదని నా ప్రాణాలు తియ్యడం తప్పించి!" అన్నారు. నేను మరింత సిగ్గు పడుతుంటే శంకర్‌గారు మళ్ళీ గలగలా నవ్వేశారు.

"ఓ.కే. సీయూ టుమారో" అంటూ చెయ్యి ఊపి వెళ్ళి పోయారు.

నా మనస్సు బెలూన్‌లా ఉబ్బి గాలిలో తేలుతున్నట్లనిపించింది.

మర్నాడు పొద్దున్నే లేచి గబగబా వంట పూర్తిచేసి ఆయనతో బాటు నేనూ తయారైపోయాను. జరీ లేకుండా సింపుల్‌గా ఉన్న కంచి పట్టు చీర కట్టుకున్నాను. పమిట కదిలి పోకుండా పిన్ను పెట్టి మరో సారి సర్దుకున్నాను.

"ఇంత తొందరగా వెళ్ళడం దేనికి, డ్యూటీకి వెళ్ళినట్లు!" అన్నా రాయన కనుబొమ్మలు ముడిచి.

"అన్నట్లు లంచ్‌కి కదూ" అంటూ నిస్త్రాణగా కుర్చీలో చతికిల బడ్డాను. సెంటర్‌కి ఎప్పుడు వెళతానా అనే ఉత్సాహంలో సమయం, సందర్భం గుర్తుకు రాలేదు.

ఆ సెంటర్ ఇది వరకు నేను పని చేసే రోజుల్లో ఉండేచోట లేదిప్పుడు. నగరంలో ప్రసిద్ధ స్థలంలో సొంత భవనంలో ఉంది. అటో చేసుకుని వెళ్ళానక్కడికి, నన్ను గుర్తు పట్టిన ఒక పాత ఉద్యోగిని ఆనం దంతో నన్ను కౌగలించుకున్నంత పనిచేసింది. తన పేరు సునంద. తనే నన్ను తీసుకెళ్ళినలుగురైదుగురు పాత సహోద్యోగులకు పునః పరిచయం

చేసింది నన్ను చూసి వాళ్లంతాఒకటే మాట-'మేడమ్!ఇందిరా గాంధీస్టైల్లో జుట్టు నెరవడం తప్ప మీలో మార్పేమీ లేదు. అలాగే ఉన్నారు!' అని. 'మేడమ్' అంటూంటే,నవ్వొచ్చింది. పాతికేళ్లపైబడి 'అమ్మా.' 'ఆంటీ' అనే పిలుపులు వినడం అలవాటైపోయింది. మళ్ళీ 'మేడమ్' అని వినేసరికి మరో లోకంలో ప్రవేశించినట్లనిపించి మనసువింతగా పులకించింది. వద్దు మొర్రో అన్నా వినిపించుకోకుండా నన్ను కేంటీనుకి తీసుకెళ్లి కాఫీ ఇప్పించారు. ఆ తరువాత గాని నన్ను శంకర్‌గారి దగ్గరకు తీసుకు వెళ్లలేదు.

మేము శంకర్ గారి గదికి వెళ్లేసరికి ఆయన ఎవరితోనో మీటింగ్‌లో ఉన్నారు. నన్ను చూడగానే, అక్కడున్న వాళ్లకి క్షమాపణ చెప్పి బయటి కొచ్చారు.

'సారీ మిసెస్‌శర్మా, అర్జెంట్ మీటింగ్ ఒకటి ఏర్పాటు చెయ్యాల్సి వచ్చింది. ఇంకో అరగంటలో అయిపోతుంది. ఈ లోపున మీరు సెంటర్ కొంత చూసి రండి. మీ 'ఇంప్రెషన్స్' చెపుదురుగాని నాతో' అని, నా పక్కనున్న సునందతో 'మిసెస్ శర్మకి కొత్తవింగ్‌లూ, కొత్త సెక్షన్లూ చూపించండి, ఆవిడ వెళ్లాక చాలా మార్పులొచ్చాయి కదా,' అన్నారు.

శంకర్ గారు లోపలికి వెళ్లగానే మేము ఇవతలికి వచ్చేశాము. సునంద ఇప్పుడు శంకర్‌గారి తరవాత స్థానంలో ఉందిట.

సంస్థ కొత్తభవన సముదాయాన్నీ, అందులోని కొత్త కొత్త విభాగాల్నీ, వాటిలో కిట కిట లాడుతున్న ఉద్యోగుల్నీ, పరిశోధక విద్యా

ర్థుల్నీ చూస్తూంటే సంస్థ ఎంత వృద్ధి పొందిందో అర్థమవుతోంది. కానీ, మనుషుల సంఖ్యలోనూ, బీరువాలూ, బల్లలూ, వీటిలోనూ ఎంత పెరుగుదల కనిపిస్తోందో, ఏ మూల చూసినా, ఏ బల్లమీద చూసినా కట్టలుగా, గుట్టలు గుట్టలుగాపడి ఉన్న ఫైళ్లూ, పుస్తకాలూ, పేపర్లూ—వీటిసంఖ్యలో కూడా అంత పెరుగుదల కనిపిస్తోంది. ఎక్కడ చూసినా దుమ్ము పేరుకుపోయి ఉన్న పుస్తకాలూ, పేపర్లూ! ఒక పెద్ద హాలంతా మైక్రోఫిల్మ్ కేబినెట్లతో, మైక్రోఫిల్మ్ రీడర్స్‌తో నిండి ఉంది. మరో గదిలో మైక్రో ఫిల్ములున్న డబ్బాలు గుట్టలుగా బల్లమీద ఉన్నాయి. మరో పెద్ద గదిలో జిరాక్స్ మెషీన్లున్నాయి. ఆ సమయంలో విద్యుచ్ఛక్తి లేకపోవడంవల్ల ఉద్యోగులు ఖాళీగా కూర్చుని పేపర్లు చదువుకుంటున్నారు.

'ఇంత మంది ఉన్నా ఇంత పెండింగ్ వర్క్ కనిపిస్తోందేమిటి?' అని అడిగాను సునందని.

'ఎంత మంది ఉద్యోగులున్నా, కొంత మంది లీవ్ మీద ఉంటారు, కొంత మంది బద్ధకస్తులుంటారు. కొంత మంది యూనియన్ పనులతో తీరిక లేని వాళ్ళూ ఉంటారు కదా'! అంది సునంద.

'యూనియన్ ఏమిటి?' అన్నాను ఆశ్చర్యపోతూ.

'మీరుండే సమయంలో పదిహేను మందే కదా మిసెస్ శర్మా! ఇప్పుడు తొంభై మంది ఉద్యోగులున్నారు. ఇప్పుడు మాకో స్టాఫ్ యూనియన్ ఉంది. ప్రతికేడర్ నుంచీ ప్రతి నిధులున్నారు యూనియన్ ఎగ్జిక్యూటివ్ కమిటీలో. వీళ్లంతా సాఫ్ హక్కుల కోసం పోరాడటంలో బిజీగా ఉంటారెప్పుడూ. వీళ్ళు ఆఫీసుపని, యూనియన్ పనితో సతమత మవుతూ ఉంటారు' అని వివరించింది సునంద,

"మరి వర్క్ పెండింగ్ అయితే బాస్ ఏమీ అనరా?' అని అడిగాను—ఇదివరకు శంకర్ గారి క్రమశిక్షణ, గాంభీర్యం గుర్తుకొచ్చి.

'ఏ మంటే మాత్రం ఏం ప్రయోజనం? పని ఎప్పుడూ పేరుకు పోతూనే ఉంటుంది. వరసగా మూడు రోజులు సెలవులొస్తే పని పేరుకు పోతుంది, రెండు రోజులు ఎవరైనా సెలవు పెడితే పనిపేరుకుపోతుంది. ఎవరెంత అవస్థపడినా దానికి అంతనేది ఉండదు' అని ఏదో కొత్త సత్యాన్ని బోధిస్తున్నట్లుగా చెప్పింది సునంద.

శంకర్ గారితోనూ, మరో ఇద్దరు పాత సహోద్యోగులతోనూ కలిసి కబుర్లు చెబుతూ లంచ్ తీసుకున్న తరువాత శంకర్ గారితో ఒంట రిగా మిగిలినప్పుడు, నా మనస్సులో అంతవరకూ అణచి పెట్టుకున్న కోరికని బయటపెట్టాను.

'కొన్నాళ్ల పాటు నాకు ఇక్కడి కొచ్చి వాలంటరీగా పని చెయ్యాలని ఉంది, రమ్మంటారా?' అని అడిగాను.

శంకర్ గారు ఒక్కక్షణం తెల్లబోయినట్లు చూసి, అంతలోనే ముఖం మీదికి చిరునవ్వు తెచ్చుకుని, 'మీరొచ్చి ఊరికే పని చేస్తానంటే అంతకన్న ఏం కావాలి? నాకేం అభ్యంతరం లేదు. మీ కార్యదీక్ష, చురుకుతనం కొంచెం కొత్త స్టాఫ్‌కి ఇంజక్టు చెయ్యండి' అన్నారునవ్వుతూ.

నేను ఏనుగెక్కినంత సంబరపడ్డాను-నామీద ఆయన వెలి బుచ్చిన సదభిప్రాయానికి.

మర్నాడు మావారు వద్దంటున్నా పట్టించుకోకుండా, పదిగంట లకే ఆయనతోబాటు బయలుదేరి, సెంటర్‌కి వెళ్ళాను. ఆయన నన్ను

దారిలో దింపేసి వెళ్ళిపోయారు. నేను వెళ్ళేసరికి సునంద ఇంకా రాలేదు ఒక పాత ప్యూన్ కనిపించాడు ముందు. అతన్ని పలకరించి కుశల ప్రశ్నలు వేస్తూ కూర్చున్నాను. అతను వచ్చే ఏడు రిటైరై పోతున్నాడుట. మాట్లాడుతూ మధ్యమధ్యలో తెగ దగ్గుతున్నాడు. మధ్యలో అడిగాడు-'మేడమ్, ఇక్కడ ఏదన్నా ఉద్యోగానికి ప్రయత్నిస్తున్నారా?' అని.

'లేదయ్యా! నా కిప్పుడు ఉద్యోగం ఎవరిస్తారు? ఊరికే కాలక్షేపానికి పని చేద్దామని వచ్చాను' అన్నాను.

ఈలోపున మరో పాత సహోద్యోగి వచ్చాడు మాదగ్గరికి, అతను మొదట్లో ప్యూన్‌గానే చేరినా, క్రమంగా పై చదువులు చదువుకుని ఇప్పుడు ప్రొఫెషనల్ కేడరులోకి వచ్చాడుట. గంగారాం ఇది వరకు రోజుల్లో నా బల్లదగ్గర నిలబడి మాట్లాడేవాడు. ఇప్పుడు దర్జాగా నాఎదుట కాలుమీద కాలు వేసుకుని జార్లబడి కూర్చుని మాట్లాడుతూంటే నాకు తమాషాగా అనిపించింది. అతన్ని అభినందించాను అతని కృషికి. ఉన్నట్లుండి అతనన్నాడు-'మేడమ్, మీరు ఇక్కడ వాలంటరీగా పనిచెయ్యాలనుకుంటున్నారట. నిన్న బాస్ చెప్పారని సునందగారన్నారు.'

అతని మాటలకు అవునన్నట్లు చిరునవ్వు నవ్వాను.

'ఎందుకండీ మేడమ్ మీకీ పని? ఈ వయస్సులో ఎందుకింత అవస్థ'? అన్నాడు గంగారాం.

'అవస్థ అంటా వేమిటి! నేను ఆనందం కోసమే పని చెయ్యాలనుకుంటున్నాను'.

అతనింకా ఏదో అనబోతూంటే, 'హాయ్' అంటూ సునంద పలక రించింది. సునందతో కలిసి తన సెక్షన్‌లోకి వెళ్ళిపోయాను

మధ్యాహ్నం నేను న్యూస్ పేపర్ క్లిప్పింగ్స్ పరిశీలిస్తూంటే గంగారాం వచ్చాడు అటువైపు. వచ్చి నాఎదురుగా నుంచుని,

'మేడమ్, కాఫీ తీసుకుందాం కేంటీన్‌కి రండి మేడమ్' అన్నాడు. నేను కళ్ళజోడు తీసి బల్లమీద పెట్టి, థాంక్సు గంగారాం, నీకు తెలుసుగా, నేను అలామధ్యలో కాఫీ గట్రా తీసుకోనని! అందులోనూ...'అంటూంటే మధ్యలోఅడ్డుకుని, 'మీతో కొంచెం మాట్లాడాలని ఉంది, ప్లీజ్, రండి మేడమ్' అన్నాడు.

అతని మాట కాదనలేక బయలుదేరాను. నేను పని చేస్తున్న రోజుల్లో అతను ప్యూన్. ఇప్పుడు ఎంత ప్రొఫెషనల్ అయినా, అతనితో కలిసి ఒంటరిగా కేంటీన్‌కి వెళ్ళడం ఎబ్బెట్టుగా తోచింది-అందులోనూ ఒక మగవాడితో కలిసి. ఇంకెవరినైనా తోడుగా రమ్మని పిలవడం కూడా 'సిల్లీ'గా తోచింది. చేసేది లేక, గంగారాంతో కలిసి కేంటీన్‌కి వెళ్ళాను. మేం వెళ్ళడం ఎక్కడ శంకర్‌గారి కంట పడుతుందోనని సిగ్గుతో కుంచించుకుపోతూ వెళ్ళాను. ఇదివరకు పని మధ్యలో ఎవరైనా కేంటీన్‌కి వెళితే మండిపడేవారు శంకర్‌గారు. ఆయన ఇంటిపెద్ద, మేమంతా ఆయన కుటుంబ సభ్యులం అన్నట్లుగా ప్రవర్తించేవారు. మా అందరికీ అప్పట్లో ఆయనంటే ఓవైపు ఆరాధన, ఓ వైపు భయం.

కాఫీ తాగుతూ గంగారాం మళ్ళీ అన్నాడు- 'ఎందుకు మేడమ్? ఈ వయస్సులో మీరిలా కష్టపడటం?' అని.

నేను చిరునవ్వు నవ్వి, 'కష్టమేముంది గంగారాం? పని అంటే నా కెప్పుడూ ఇష్టమే. ఇన్నాళ్లూ పరిస్థితులు కలిసి రాక ఉద్యోగం చెయ్యలేక పోయాను. నాకు డబ్బుకి లోటు లేదు. కానీ, పనిచేస్తే కలిగే తృప్తి, ఆనందం వేరు. మీ అందరితో కలిసి మళ్ళీ పని చేస్తూంటే మళ్ళీ యౌవనం వచ్చినంత ఉత్సాహం కలుగుతోంది' అన్నాను.

గంగారాం నా మాటలకు చిరునవ్వు కూడా నవ్వలేదు. పైగా గంభీరంగా మొహంపెట్టి, 'మేడమ్, మీకు డబ్బుకిలోటులేదు. డబ్బు అవసరం ఉన్నవాళ్లే పనిచేస్తే మంచిది కదా' అన్నాడు.

నేను కొంచెం తెల్లబోయినా, తేరుకొని, 'అదేమిటి గంగారాం? నేను ఊరికెనే పని చేస్తానన్నాను కదా. జీతం కోసం జాబ్‌లా కాదు కదా!' అని నొక్కి చెప్పాను.

"మీరు పని చెయ్యడం జీతం కోసం కాదని తెలుసు మేడం. మీరే అర్థం చేసుకోవడం లేదు ఇక్కడి సమస్య."

"సమస్యా? మీ పెండింగ్ వర్క్ చూశాకే కదా నాకు వచ్చి వాలంటరీగా పని చెయ్యాలనిపించింది! ఇదివరకు ఎవరైనా ఇలా వాలంటరీగా వచ్చి పని చేస్తామంటే పెండింగ్ వర్క్ క్లియర్ అవుతుందని ఎంతో సంతోషించే వాళ్ళం" అని పాత రోజుల్ని గుర్తు చేశాను.

"ఆ రోజులు వేరు మేడమ్! ఇప్పుడు వర్క్ పెండింగ్‌గా ఉంటే దాన్ని క్లియర్ చెయ్యడానికి 'ఓవర్ టైమ్' పని చేసి అదనంగా డబ్బు సంపాదిస్తారు స్టాఫ్. ఇంకా మిగిలి పోతూంటే కొత్త స్టాఫ్‌ని అదనంగా

నియమించమని అధికారుల్ని కోరడానికి పీలవుతుంది. మీలాంటి వాళ్ళు వచ్చి పని క్లియర్ చేసేస్తే మావాళ్ళ నోట్లో మన్ను కొట్టినట్లవుతుంది కదా మేడమ్? ఈ విషయం యూనియన్ దాకా వెడుతుంది. సెక్రటరీగా నేనేం సమాధానం చెప్పుకుంటాను?" అన్నాడు ఉద్రేకంగా.

కాలం మారిందని గ్రహించేసరికి నా తల గిర్రున తిరిగినట్లయింది. ఉచితంగా పని చేస్తానన్నా అనుచిత మనిపించుకుంటున్నాను. ఏదో కానిపని చేసినట్లు సిగ్గుతో తల వంచుకున్నాను.

(ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక, 1-3-89)